పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

# పోరు తెలంగాణ
## డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 శుక్రవారం 16-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04



## సీఎం రేవంత్ ఆదేశాల అమలు..
# విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

- యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్
- విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్కో ఉత్తర్వులు
- విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
- విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక

2లో

**ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక**

తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు

# కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం
## రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!



- బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ
- నిషేధిత భూముల వ్యవహారాన్ని ప్రస్తావించిన హరీశ్ రావు
- ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, - మిగతా 2 లో

## సింగరేణి ప్రైవేటీకరణపై
# మంత్రి కీలక ప్రకటన



- సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ
- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్‌ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని - మిగతా 2 లో

## గడ్డంతో న్యూ లుక్
## అసలు కారణం చెప్పిన కేటీఆర్

- కొత్త గడ్డం లుక్‌తో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచిన కేటీఆర్
- రామగుండం పర్యటన నేపథ్యంలోనే ఈ మార్పు అని వెల్లడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కేటీఆర్ ఫొటోలు, వీడియోలు
- కేటీఆర్ లుక్‌ను 'మాస్' అంటూ ప్రశంసిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు
- 'ఆ మాత్రం ఉండాలి' అంటూ గడ్డంపై కేటీఆర్ సరదా వ్యాఖ్య



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తన సరికొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎప్పుడూ క్లీన్ షేవ్‌తో కనిపించే ఆయన, ఈసారి గడ్డంతో దర్శనమివ్వడం రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, - మిగతా 2 లో

## నౌకలోని 21 మంది సిబ్బంది సురక్షితంగా గట్టెక్కారు



- హర్మూజ్ జలసంధిలో నౌక మునక.. సముద్రంలో తేలియాడుతున్న ఐఫోన్లు, పెర్ఫ్యూమ్‌లు
- హర్మూజ్ జలసంధిలో మునిగిపోయిన యూఏఈ కార్గో నౌక
- సముద్రంలో తేలియాడుతున్న ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్‌లు
- మైన్ వల్లే ప్రమాదం అన్న ఇరాన్, దాడి జరిగిందన్న అధికారులు
- ప్రాంతంలో పెరుగుతున్న వాణిజ్య నౌకలపై దాడుల ఘటనలు

హర్మూజ్ జలసంధిలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల మధ్య యూఏఈకి చెందిన ఒక భారీ - మిగతా 2 లో

## పాకిస్థాన్‌లో తీవ్ర విషాదం.. స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి



- పెషావర్‌లో కూలిన స్కూల్ పైకప్పు
- ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక టీచర్ మృతి
- 40 మందికి పైగా విద్యార్థులకు తీవ్ర గాయాలు
- పాఠశాల యజమానిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై దర్యాప్తునకు ఆదేశించిన అధికారులు - మిగతా 2 లో

## అలాంటి వాళ్లను కాల్చి చంపాలి
# ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- సైనిక రహస్యాలు లీక్ చేసేవారిని కాల్చి చంపాలన్న ట్రంప్
- ఇరాన్‌పై దాడి వివరాలు మీడియాకు లీకయ్యాయని ఆరోపణ
- లీకేజీతో సైనిక చర్య సమయం మార్చినట్లు వెల్లడి
- రెండు రోజుల తర్వాత దాడి నిర్వహించినట్లు ట్రంప్ ప్రకటన
- లీకేజీకి పాల్పడిన వ్యక్తి వివరాలు వెల్లడించని అధ్యక్షుడు



2లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సైనిక రహస్యాలను బయటపెట్టే వారిని కాల్చి చంపాలని అన్నారు. ఇరాన్‌పై దాడికి సంబంధించిన కీలక సమాచారం మీడియాకు లీక్ కావడంతో

## నైజీరియాలో ఐఎస్
# ఉగ్రవాదుల బీభత్సం



- సైనిక స్థావరంపై దాడిలో 20 మంది మృతి
- దాడిలో ఐదుగురు పౌర సేన సభ్యులు కూడా మృతి
- ఆయుధాలు దోచుకుని బేస్ క్యాంపును తగలబెట్టిన ఉగ్రవాదులు
- నైజీరియాలో మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిన హింస - మిగతా 2 లో

## భారత్‌లో పెరుగుతున్న వృద్ధులు
## మారుతున్న ఉద్యోగ సమీకరణాలు



- భారత్‌లో భారీగా పెరుగుతున్న వృద్ధుల జనాభా
- 2050 నాటికి 20 శాతానికి పైగా చేరనున్న సీనియర్ సిటిజన్లు
- రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగాల కోసం పెరుగుతున్న ఆసక్తి
- అనుభవానికి విలువనిస్తూ కొత్త అవకాశాలు కల్పిస్తున్న కంపెనీలు
- సామర్థ్యం ఆధారంగా నియామకాలు జరగాలంటున్న నిపుణులు

భారతదేశంలో జనాభా స్వరూపం వేగంగా మారుతోంది. దేశంలో వృద్ధుల సంఖ్య - మిగతా 2 లో

## సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ



- కోర్టు ధిక్కరణ కేసులో అఫిడవిట్ దాఖలు
- రైసీనా హిల్స్ పరిధిలో 24 గంటల పాటు సెల్యులర్ సేవలు నిలిపివేసినట్లు వెల్లడి
- సీఈసీ రాజీనామా కోరుతూ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు తెలిపిన ఢిల్లీ పోలీస్ కమిషనర్

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సందర్భంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించి - మిగతా 2 లో

## సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి



- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి, సీఎం
- మహిళాశక్తికి రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
- గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ గుర్తింపు తేవడమే మేళా ఉద్దేశం
- డ్వాక్రా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని వెల్లడి
- త్వరలో డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు కావాలన్న సీఎం

2 లో..

## సీఎం రేవంత్ ఆదేశాల అమలు.. విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి - జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

## కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

మొదటిపేజీ తరువాయి - బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

## సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి - రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## గడ్డంతో న్యూ లుక్.. అసలు కారణం చెప్పిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి - వీడియోలు ప్రస్తుతం అంతర్జాలంలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు దీనిని 'మాస్ లుక్' అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. నిన్న రామగుండంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో పాల్గొనేందుకు కేటీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయల్దేరిన సమయంలో ఆయన గడ్డంతో కనిపించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అనంతరం పర్యటన మార్గమధ్యంలో కరీంనగర్ వద్ద మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సతీశ్ బాబు వంటి నేతలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తన గడ్డం వెనుక ఉన్న కారణాన్ని కేటీఆర్ సరదాగా వెల్లడించారు. 'ఏందీ సంగతి.. గడ్డం పెంచినవ్?' అని గంగుల కమలాకర్ అడగ్గా, కేటీఆర్ తనదైన శైలిలో నవ్వుతూ సమాధానమిచ్చారు. "పోయేది గోదావరిఖనికే కదా.. సింగరేణికే కదా! ఆ మాత్రం ఉండాలే.. లేకపోతే నడవదు" అంటూ చమత్కరించారు. సింగరేణి ప్రాంత పర్యటనకు వెళ్తున్నందునే ఈ రకంగా సిద్ధమయ్యానని ఆయన చెప్పడంతో అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. కేటీఆర్ కొత్త లుక్ పట్ల ఆయన అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఆయన ఫొటోలను షేర్ చేస్తూ 'బాస్ ఈజ్ బ్యాక్ విత్ ఏ మాస్ లుక్' వంటి కామెంట్లతో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సాధారణంగా రాజకీయ నాయకులు తమ ఆహార్యం విషయంలో పెద్దగా మార్పులు చేయరు. అయితే, కేటీఆర్ తన లుక్‌ను మార్చడం, దానికి సింగరేణి ప్రాంతాన్ని ముడిపెడుతూ సరదాగా వ్యాఖ్యానించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## నౌకలోని 21 మంది సిబ్బంది సురక్షితంగా గట్టెక్కారు



మొదటిపేజీ తరువాయి - సరుకు రవాణా నౌక సముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదం అనంతరం సముద్ర ఉపరితలంపై ఐఫోన్లు, ఖరీదైన పెర్ఫ్యూమ్ బాటిళ్లు తేలియాడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రమాదానికి గురైన నౌక నుంచి చెల్లాచెదురైన లగ్జరీ వస్తువులను సేకరించేందుకు స్థానికులు చిన్న పడవల్లో పోటీ పడుతున్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దుబాయ్ నుంచి బయలుదేరిన సింగపూర్ పతాకం కలిగిన కంటైనర్ నౌక 'జీఎఫ్ఎస్ ప్రైడ్' బుధవారం ప్రమాదానికి గురైంది. ఏదో గుర్తుతెలియని వస్తువు ఢీకొనడంతో నౌకలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, అనంతరం అది నీట మునిగిందని మారిటైమ్ అధికారులు వెల్లడించారు. అయితే, నౌకలోని 21 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించామని, ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం కలగలేదని సింగపూర్ మారిటైమ్ అండ్ పోర్ట్ అథారిటీ ప్రకటించింది. ఈ నౌకలో సుమారు 2,500 కంటైనర్ల నిండా ఐఫోన్లు, ఖరీదైన పెర్ఫ్యూమ్‌లు వంటి విలాసవంతమైన వస్తువులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) స్పందిస్తూ, సదరు నౌక అనధికార మార్గంలో ప్రయాణిస్తూ సముద్రగర్భంలోని మైన్‌ను ఢీకొట్టడం వల్లే మునిగిపోయిందని పేర్కొంది. అయితే, నౌకపై గుర్తుతెలియని ప్రొజెక్టైల్ దాడి జరిగిందని ఇతర అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాలతో ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రపంచ చమురు, సహజవాయువు రవాణాకు అత్యంత కీలకమైన హర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు పెరిగిపోతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవలే అక్టోబర్ 6న, అమెరికా నౌకలపై నిఘా పెడుతోందని ఆరోపిస్తూ యూఎస్ దళాలు ఒక ఇరాన్ నౌకను ధ్వంసం చేశాయి. అంతకుముందు, సెప్టెంబర్ 23న జరిగిన దాడిలో 'కేప్ డావో' అనే మరో నౌక దెబ్బతిని, మునిగిపోయింది. ఆ ఘటనలో ఒకరు మరణించారు. గత 48 గంటల్లోనే ఈ ప్రాంతంలో డ్రోన్ దాడులతో సహా ఐదు ఘటనలు నమోదయ్యాయని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజెన్సీ నివేదించింది. ఈ పరిణామాలు జలసంధిలో వాణిజ్య రవాణా భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

# సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ



మొదటిపేజీ తరువాయి - దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అక్టోబర్ 9వ తేదీ రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు, అంటే 24 గంటల పాటు రైసీనా హిల్స్ పరిసరాల్లోని 4 కిలోమీటర్ల వ్యాసార్థంలో సెల్యులర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయితే, వై-ఫై, బ్రాడ్‌బ్యాండ్ వంటి సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని హోం సెక్రటరీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. కాగా, నిరసనల సందర్భంగా మెట్రో, రైళ్లు సహా ఇతర అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ఈ ఆదేశాలను ఉల్లంఘించడమేనంటూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర హోం కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సహా ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోనే హోం సెక్రటరీ తాజాగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ సమర్పించారు. మరోవైపు, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సైతం తన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. జులై 20న జరిగిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, నిరసనకారులను నియంత్రించడం కష్టతరంగా మారడం, సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం వంటి కారణాలతో అక్టోబర్ 10న తలపెట్టిన ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

## పాకిస్థాన్‌లో తీవ్ర విషాదం.. స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి



మొదటిపేజీ తరువాయి - పాకిస్థాన్‌లో గురువారం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల భవనం పైకప్పు కూలిన ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక ఉపాధ్యాయురాలు సహా మొత్తం 29 మంది దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో 40 మందికి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పెషావర్‌లోని దిర్ కాలనీ ప్రాంతంలో ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకున్నట్లు నగర పోలీస్ చీఫ్ మియాన్ సయీద్ వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించి పాఠశాల యజమానిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసే చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో ఆరుగురు బాలికల సహా 28 మంది విద్యార్థులు, ఒక మహిళా ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారని లేడీ రీడింగ్ ఆసుపత్రి ప్రతినిధి మహమ్మద్ అసిమ్ ధ్రువీకరించారు. మరణించిన చిన్నారులందరూ 13 ఏళ్లలోపు వారేనని ఆయన పేర్కొన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిని ప్రకటించినట్లు వివరించారు. భవనం కూలిన ఘటనపై పెషావర్ డిప్యూటీ కమిషనర్ అఫాక్ వజీర్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండవచ్చనే అనుమానంతో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ దారుణ ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రావిన్స్ గవర్నర్ ఫైజల్ కరీం కుండి కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

## భారత్‌లో పెరుగుతున్న వృద్ధులు.. మారుతున్న ఉద్యోగ సమీకరణాలు

మొదటిపేజీ తరువాయి - గణనీయంగా పెరుగుతుండటంతో, పదవీ విరమణ వయసు తర్వాత కూడా ఉపాధి అవకాశాలపై కొత్తగా చర్చ మొదలైంది. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'ఇండియా ఏజింగ్ రిపోర్ట్' ప్రకారం 2022లో దేశ జనాభాలో 10.5 శాతంగా ఉన్న 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య, 2050 నాటికి 20 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా. ఈ పరిణామం సంప్రదాయ పదవీ విరమణ భావనను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. రిటైర్మెంట్ తర్వాత కూడా పనిచేయడానికి సీనియర్ సిటిజన్లు ఆసక్తి చూపుతున్నారని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'నేషనల్ కెరీర్ సర్వీస్' పోర్టల్‌లో వృద్ధులకు అనువైనవిగా భావిస్తున్న సుమారు 1.68 లక్షల ఉద్యోగ ఖాళీలు నమోదయ్యాయి. అదే సమయంలో దాదాపు 1.89 లక్షల మంది సీనియర్ సిటిజన్లు ఉద్యోగాల కోసం ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం గమనార్హం. ఇది పని చేయడానికి వారిలో ఉన్న ఆసక్తిని, మార్కెట్లో ఉన్న అవకాశాలను సూచిస్తోంది. ప్రభుత్వ వేదికలే కాకుండా 'విజ్డమ్‌సర్కిల్' వంటి ప్రైవేట్ ప్లాట్‌ఫామ్‌లు కూడా అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్‌ను, రిటైర్ అయిన వారిని కంపెనీలతో అనుసంధానిస్తున్నాయి. కన్సల్టింగ్, మెంటరింగ్, ప్రాజెక్ట్ ఆధారిత పనుల కోసం వీరి నైపుణ్యాలను సంస్థలు ఉపయోగించుకుంటున్నాయి. వయసును కాకుండా వారి అనుభవాన్ని, నైపుణ్యాన్ని గౌరవించే ఫ్లెక్సిబుల్ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోందనడానికి ఇది నిదర్శనం. ఇటీవల ముంబైకి చెందిన ఒక స్టార్టప్‌లో 64 ఏళ్ల వ్యక్తి ఇంటర్న్‌గా చేరడం వంటి సంఘటనలు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. అయితే, ఈ మార్పు అంత సులభం కాదు. వయసు పెరిగిన వారు టెక్నాలజీకి అంత తొందరగా అలవాటుపడలేరని, వారికి ఎక్కువ జీతాలు ఇవ్వాల్సి వస్తుందనే కొన్ని అపోహలు నియామకాలకు అడ్డంకిగా మారుతున్నాయి. కానీ, వాస్తవానికి సీనియర్ ఉద్యోగులు తమతో పాటు అపారమైన సంస్థాగత పరిజ్ఞానం, బలమైన వృత్తిపరమైన నెట్‌వర్క్‌లు, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని తీసుకొస్తారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పనిచేసే కాలాన్ని పొడిగించడం, శ్రామిక శక్తిలో వృద్ధుల భాగస్వామ్యాన్ని పెంచడం, ఫ్లెక్సిబుల్ రోల్స్ కల్పించడం వంటివి దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణపై భారం తగ్గడమే కాకుండా, దేశ వృద్ధికి కూడా దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో అనేక కంపెనీలు నిరంతర అభ్యాసం, దశలవారీ పదవీ విరమణ, తరం-తరం మధ్య సహకారంతో పనిచేసే బృందాలు వంటి నూతన విధానాలను అన్వేషిస్తున్నాయి. అంతిమంగా వయసును ఒక అడ్డంకిగా చూడకుండా, వారి సామర్థ్యం, అనుభవం ఆధారంగా అవకాశాలు కల్పించే పారదర్శకమైన వ్యవస్థను నిర్మించడమే అసలైన సవాలు.

# సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి



మొదటిపేజీ తరువాయి - విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలిసారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియాడారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని ప్రశంసించారు. మహిళా శక్తిని చాటేందుకే విజయవాడలో ఈ మేళాను ఏర్పాటు చేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 650 స్టాళ్లు మహిళల నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ఉత్పత్తులు జాతీయ ఉత్పత్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా ఒక చరిత్ర సృష్టిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం డ్వాక్రా సంఘాలు రూ.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుంటూ, లక్ష కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయని, త్వరలోనే ఇది రూ.10 లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. త్వరలోనే పది లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆరు కోట్ల మందిని వ్యాపారవేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆయన స్ఫూర్తి ప్రశంసనీయమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తమ ఆశయమని సీఎం స్పష్టం చేశారు.

## నైజీరియాలో ఐఎస్ ఉగ్రవాదుల బీభత్సం



మొదటిపేజీ తరువాయి - నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పెను విధ్వంసం సృష్టించారు. ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో ఉన్న ఓ సైనిక స్థావరంపై ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ ఉగ్రవాదులు మంగళవారం రాత్రి భీకర దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 మంది సైనికులు, ఐదుగురు పౌర సేన సభ్యులు (యాంటీ-జిహాదిస్ట్ మిలీషియా) మరణించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. లేక్ చాద్ ప్రాంతంలోని మైరారీ గ్రామంలో ఉన్న ఈ సైనిక స్థావరాన్ని ఉగ్రవాదులు పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆయుధాలను దోచుకుని, స్థావరంలో ఉన్న వాహనాలతో సహా అన్నింటికీ నిప్పుపెట్టి బేస్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన సైనికులు సమీపంలోని మోంగునో పట్టణానికి చేరుకున్నారు. మరికొందరు సైనికుల ఆచూకీ గల్లంతవగా, వారిని ఉగ్రవాదులు బంధించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, రాత్రి 10 గంటల ప్రాంతంలో మొదలైన ఈ దాడి ఉదయం వరకు కొనసాగింది. ఉగ్రవాదులు సైనికులను తరిమికొట్టి, స్థావరంలోని విలువైన వస్తువులన్నింటినీ దోచుకుని, మిగిలిన వాటిని తగలబెట్టారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొరుగున ఉన్న గుడుంబాలి ప్రాంతం నుంచి ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా నైజీరియాలో ఉగ్రవాద హింస విపరీతంగా పెరిగింది. బోకో హరామ్, దాని నుంచి విడిపోయిన ఐఎస్ డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద సంస్థలు దాడులకు తెగబడుతున్నాయి. 17 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ హింసలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. గత మూడు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత తీవ్రమైన హింసాత్మక పరిస్థితులు ప్రస్తుతం నైజీరియాలో నెలకొన్నాయని ఏసీఎల్ఈడీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## అలాంటి వాళ్లను కాల్చి చంపాలి.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి - సైనిక చర్య సమయాన్ని మార్చాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇలాంటి వారికి జీవితాంతం జైలు శిక్ష విధించాలని కూడా వ్యాఖ్యానించారు. అరిజోనా రాష్ట్రంలోని బుల్‌హెడ్ సిటీలో ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ముందు అమెరికా బాంబర్లు బయలుదేరే, చేరుకునే సమయాలు మీడియాకు చేరాయని ఆరోపించారు. ఈ వివరాలు న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్‌లో వచ్చినట్లు పేర్కొన్నారు.

### దాడి సమయం మార్చాల్సి వచ్చింది!

మిస్సోరీ నుంచి బీ-2 స్టెల్త్ బాంబర్లు బయలుదేరే సమయం బయటకు పొక్కడంతో ఆపరేషన్ ప్రమాదంలో పడిందని ట్రంప్ చెప్పారు. ఈ విషయంపై సీనియర్ సైనికాధికారులతో చర్చించినట్లు తెలిపారు. జనరల్ రజిన్ కేన్‌తో మాట్లాడిన తర్వాత దాడిని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అప్పటికే దాడికి సిద్ధమైన పైలట్లు ఈ నిర్ణయంతో నిరాశకు గురయ్యారని చెప్పారు.

### రెండు రోజుల తర్వాత దాడి

తొలుత అనుకున్న దాడిని రెండు రోజుల తర్వాత నిర్వహించినట్లు ట్రంప్ తెలిపారు. మొదట లీకైన సమయానికే బాంబర్లను పంపామని, దీంతో ఇరాన్ సైన్యాన్ని ఆశ్చర్యానికి గురిచేయగలిగామని పేర్కొన్నారు. అమెరికా సైనిక చర్యను ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా అభివర్ణించారు.

అయితే, లీకేజీకి పాల్పడిన వ్యక్తి ఎవరనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఆరోపణలకు మద్దతుగా ఆధారాలు చూపలేదు. ఈ వ్యవహారంలో విచారణ ద్వారా ఎవరినైనా గుర్తించారా? అన్నదానిపైనా స్పష్టత ఇవ్వలేదు.

### గూఢచర్య చట్టం కింద చర్యలు

అమెరికాలో జాతీయ రక్షణకు సంబంధించిన సమాచారాన్ని అనధికారికంగా బయటపెట్టడంపై కఠిన చట్టాలున్నాయి. అందులో 'ఎస్పియోనేజ్ యాక్ట్' కీలకమైనది. ఈ చట్టం కింద రహస్య సమాచారాన్ని అక్రమంగా భద్రపరచడం, ఇతరులకు చేరవేయడం వంటి చర్యలపై కేసులు నమోదు చేయవచ్చు. ఈ నేపథ్యంలో సైనిక రహస్యాల లీకేజీపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# సేవా సంకల్ప అభియాన్

నీటి సంరక్షణ జల వనరుల శుభ్రత కార్యక్రమం..





**మహేశ్వరం అక్టోబర్ 15, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని పడమటితండాలో నీటి సంరక్షణ, జల వనరుల శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం నీటి ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలనే సందేశాన్ని అందించడం జరిగిందని వక్తలు పేర్కొన్నారు. నీటిని కాపాడుకుందాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బొక్క నర్సింహా రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుండే వెంకటేష్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్ , రాష్ట్ర గిరిజన మోర్చా మీడియా కన్వీనర్ విశాల్ నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు పంతు నాయక్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోతర్ల సుదర్శన్ యాదవ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్ గారు, హన్మాత్ నాయక్ , మండల అధ్యక్షులు తెల్లమల్ల యాదిష్, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్, మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, మండల గిరిజన మోర్చా అధ్యక్షులు అంగోత్ కృష్ణ నాయక్, మండల యువ మోర్చా అధ్యక్షులు మరియు సర్పంచ్ వినోద్ నాయక్, గిరిజన మోర్చా మండల ప్రధాన కార్యదర్శి రామావత్ హరిలాల్, మునవత్ దేవేందర్, గౌరవ సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,శక్తి కేంద్ర ఇన్చార్జిలు, బూత్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలి

అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి..





**మహేశ్వరం, అక్టోబర్ 15, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** పేద రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల పట్ల మర్యాదగా ప్రవర్తించి మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆమె సూచించారు. ప్రసవాలను పెంచే విధంగా కృషి చేయాలని ఆమె తెలిపారు. పేదలకు అందుతున్న వైద్యాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగుల రికార్డులు, అటెండెన్స్ తదితర అంశాలను సూపరిండెంట్ డాక్టర్ రాజగోపాల్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, ఉపసర్పంచ్ జోరల రమేష్, డాక్టర్ రవీంద్రబాబు, మహమ్మద్ రఫీ యుద్దీన్, హెడ్ నర్స్ పార్వతి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమ... ఎస్సై బి శాంతి



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ–పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం అక్టోబర్ 15:–** ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అశ్వాపురం ఎస్సై బి. శాంతి సూచించారు. అశ్వాపురం సీఐ సిహెచ్ ఎల్లయ్య ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలకు మోసపోకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్సై బి. శాంతి ప్రజలకు సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా ఆర్థిక నష్టాలను నివారించవచ్చని తెలిపారు...

# మార్కండేయ మందిరాన్ని సందర్శించిన దేవదాయ శాఖ ఇంజనీరు,స్థపతి



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్)** : వేలాది సంవత్సరాల నుండి ఆధ్యాత్మిక శోభను పంచుతున్న బాల్కొండ మండల కేంద్రంలోని మార్కండేయ మందిర పునర్నిర్మాణం పనుల్లో భాగంగా.. మొదటి మెట్టుగా దేవాదాయక శాఖ ఇంజనీరు,స్థపతిలు గురువారం ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని విగ్రహాలను, పరిసరాలను అంచనాల కోసం కొలతలు తీసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ నిజామాబాద్ ఏఈ రమేష్,స్థపతి వెంకటేష్ మార్కండేయ గుడి యొక్క అంచనాల కొరకు ఆలయాన్ని సందర్శించారు.తక్షణమే దేవాదాయశాఖ అంచనాకు అనుగుణంగా అవసరమైన డిపాజిట్లు చెల్లించాలని వారు సూచించారు.వారి వెంట బాల్కొండ పద్మశాలి సంఘం అధ్యక్షుడు అంద వెంకటగిరి, కోశాధికారి కుందారపు శ్రీనివాస్,కార్యదర్శి మేక నాగేష్,మైసరి పెద్ద గంగాధర్,భోగ గంగా కిషన్,బోగ భూమేష్ లు ఉన్నారు.

# చేనేత భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయాలని వినతి

చేనేత కార్పొరేషన్ కార్యాలయం హైదరాబాద్ లో చేనేత టెస్కో చైర్మన్ దూడెం వెంకటరమణ కు వినతిపత్రం అందజేత...




**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:అక్టోబర్ 15 (పోరు తెలంగాణ న్యూస్) :** చేనేత భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ దోమకొండ చేనేత సహకార సంఘం చైర్మన్ బత్తిని సిద్ధ రాములు చేనేత టెస్కో చైర్మన్ దూడెం వెంకటరమణకు చేనేత కార్పొరేషన్ కార్యాలయం హైదరాబాదులో వినతిపత్రం అందజేశారు. చేనేత కార్మికుల అభివృద్ధికి, వారి సంక్షేమానికి, చేనేత రంగానికి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించడానికి భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన వివరించారు. చేనేత భవన నిర్మాణానికి అవసరమైన రూ.50 లక్షల నిధులను మంజూరు చేసి సహకరించాలని కోరారు. చేనేత కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విజ్ఞప్తిని పరిశీలించి సానుకూలంగా స్పందించాలని కోరారు.

# పినపాక అభివృద్ధి ప్రదాత రేగా కాంతారావు విమర్శించే ముందు మీ స్థాయి తెలుసుకోండి...!

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా...?

ప్రజలకు అన్నీ తెలుసు...!

బిఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు... గద్దల రామకృష్ణ

**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ–పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం, అక్టోబర్ 15:** అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అశ్వాపురం మండలం బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ విమర్శించారు రేగా కాంతారావు అంటేనే అభివృద్ధి అనే నినాదంతో ఆయన చేసిన పనులను గుర్తుచేస్తున్నారు. గిరిజన రైతులకు పోడు పట్టాలు, గ్రామాలకు సీసీ రహదారులు, సాగునీటి సౌకర్యాల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన కృషిని మరచిపోలేమని పేర్కొంటున్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై గొంతెత్తే నాయకుడిగా రేగా కాంతారావు నిలిచారని చెబుతున్నారు. మండలంలో అభివృద్ధికి నాంది పలికింది ఎవరో మీకు తెలియదా.. అశ్వాపురం మండలంలో సైడ్ డ్రైనేజీలు, డబుల్ రోడ్డు, డివైడర్లు, సెంటర్ లైటింగ్ కోసం నిధులు తీసుకొచ్చినప్పుడు ఆ పనులను పూర్తి చేయడంలో ఉన్న జాప్యంపై సమాధానం చెప్పాలని విమర్శకులను ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనులపై స్పష్టత ఇవ్వకుండా విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీస్తున్నారు.

**అధికారం ఎక్కడుంటే అక్కడేనా.. కాంట్రాక్టుల కోసమేనా?**

అధికారంలో ఉన్న పార్టీలతో అనుబంధాలు కొనసాగిస్తూ కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, ఇప్పుడు రేగా కాంతారావును విమర్శించడం విడ్డూరంగా ఉందని రామకృష్ణ మండిపడుతున్నాయి.అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు స్పందించాల్సి ఉంది.

**చరిత్రలో నిలిచే పేరు.. రేగా కాంతారావు!**

ఓటమి, గెలుపులతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉండే నాయకుడే నిజమైన నాయకుడని, ఫ్లెక్సీల్లో కనిపించడం కాదు.. ప్రజల గుండెల్లో నిలవడమే నాయకత్వానికి అసలైన గుర్తింపు అని ఆయన అభిమానులు పేర్కొంటున్నారు. “చెరిపితే చెరిగిపోయే పేరు కాదు.. పినపాక చరిత్రలో తనదైన ముద్ర వేసిన పేరు రేగా కాంతారావు. విమర్శలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోండి.. అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉండండి!” ప్రజలు అంతా గమనిస్తున్నారని సరైన టైంలో గుణపాఠం తప్పదని రామకృష్ణ అన్నారు.



# సాగర్ ఆయకట్టుపై ఉన్న శ్రద్ధ తుమ్మలచెరువుపై ఏదీ?

మారెళ్లపాడు పంపులు ప్రారంభించి నెల కావస్తున్నా చెరువులోకి నీరేది?

మారెళ్లపాడు మోటార్ల కు 24 గంటలు విద్యుత్ సప్లై చేయాలి.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు సాగునీటి కష్టాలు.

నెల్లిపాక సొసైటీ మాజీ అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ–పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం అక్టోబర్ 15:–** సాగర్ ఆయకట్టుకు నీటిని అందించడంలో చూపుతున్న శ్రద్ధ తుమ్మలచెరువు ఆయకట్టుపై ఎందుకు లేదని నెల్లిపాక సొసైటీ మాజీ అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పంపులు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా తుమ్మలచెరువును నింపకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగర్ ఆయకట్టుకు మోటార్ల ద్వారా రేయింబవళ్లు నీటిని తరలించేందుకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం, తుమ్మలచెరువులో అర టీఎంసీ నీటిని నింపడంలో ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు.ముగ్గురు మంత్రుల ప్రోత్సాహంతో సాగర్ ఆయకట్టు చివరి ప్రాంతాలకు నీటిని తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇదే శ్రద్ధ స్థానిక రైతుల సాగునీటి అవసరాలపై కూడా చూపాలని డిమాండ్ చేశారు.24 గంటలు మోటార్లకు కరెంటు అందించాలని,మోటార్లను 24 గంటలు యుద్ధ ప్రాతిపదికన నడపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సాగర్ ఆయకట్టుకు రేయింపగలు నీటిని తరలిస్తున్న ప్రభుత్వం,స్థానికంగా ఉన్న తుమ్మలచెరువుకు నీరందించే మారెళ్ళ పాడు మోటార్లకు కోతలు లేకుండా 24 గంటలు కరెంటు సప్లై చేయాలన్నారు.తుమ్మలచెరువుకు నీటిని విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తుమ్మలచెరువును వెంటనే నింపాలని,లేనిపక్షంలో రైతాంగం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అవసరమైతే ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తున్న నీటిని నిలిపివేసి, తుమ్మలచెరువును నింపటంలో శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు.

# రేగా పద్ధతి మార్చుకో!లేకపోతే తగిన మూల్యం

చేల్లించాల్సివస్తాది. జిల్లా కాంగ్రెస్ నాయకులు

వెంకటరెడ్డి. హెచ్చరిక

**కొత్తగూడెం అక్టోబర్ 15 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** రేగ. కాంతారావు ఉపాధ్యాయ వృత్తిని నుండి వచ్చిన విషయం మర్చిపోయారా? నీతిమాలిన మాటలు మాట్లడటం సంస్కార హినులకు మాత్రమే చెల్లు. అవుతుందని నువ్వు నిన్న అధికారులు, ప్రజాప్రతినిధులపై మాట్లాడిన మాటలకు తక్షణమే క్షమాపణ చేప్పాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొమటరెడ్డి డిమాండ్. చేశారు ప్రజాప్రతినిదిగా ఉన్న సమయం లో భుర్గంపాడు నుండి టి కొత్తగూడెం వరకు తమరు ఇసుక దందా చేయలేదా? ఈరోజుకు తమరి బినామిలే ఇసుక దందా కొనసాగిస్తున్న కళ్ళు ముసుకుని, చూడనట్టు వ్యవరించడం చిగ్గుచేటు. అని అన్నారు తమరి హయాంలో పినపాక నియోజకవర్గం లో ఏన్ని భూములు అన్యక్రాంతం కాలేదు?వందాలాధి ఎకారాలు. అటవి, పెదల భూములు అడ్డగోలుగా దోచుకున్న విషయం ప్రజలకు తెలియదనుకుంటున్నారా? ఇవ్వాల మా ఎం ఎల్ ఎ నిజాయితీగా కొనుగోలు చేస్తే అనవసరంగా నోరు పారేసుకోవడం వెనుక, తమరి భూముల బండారం ఎక్కడ బయట పడుతుందనే భయంతో ఇలాంటి మాటలు.అనవసర ప్రేలపనలు మానుకో, లేదంటే, ప్రజా క్షేత్రంలో తగినశాస్తి చేప్పడం జరుగుతుంది. అన్నారు మణుగూరు మండల కేంద్రం లో ఎంతమంది పెదల ఇంటి స్థలాలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమించుకోలేదు. ఎంతమంది బాదితులు అ సమయంలో మీడియా ముందు వారిగోడు వెల్లబోసుకున్న విషయం మర్చిపోయా రా? మా ఎం ఎల్ఎ నిజాయితీ గా, యస్ బిలో ఏ యస్ఐ పని చేస్తు రిటైర్డ్ అయిన బి అర్ యస్ పార్టకి చెందిన వ్యక్తి కుటుంబ నుండి కొనుగోలు చేసిన భూమి గురించి ప్రేలపనలు చేస్తున్నావ్,?అదే నిజమైతే, వారు అక్రమంగా అక్రమించినదేనా?సమాధానం చేప్పాలి. మా యం ఎల్ ఎ చేస్తున్న అభివృద్ధిని చూసి ఒర్వలేక, ఎక్కడ పుట్టగతులు ఉండవనో నోటికి వచ్చినట్లు మాట్లాడితే తగిన ప్రజలే గుణపాఠం చెప్తారు ఎమ్మెల్యే ఎలక్షన్లో నీకు ప్రజలు ఛీ కొట్టిన నీకు బుద్ధి రాలేదు ఇకనైనా నీ పద్ధతి మార్చుకో అనే రేఖకాంతారావు ను ఘాటుగా వ్యాఖ్యలు చేశారు



# రైతులకు 24 గంటల విద్యుత్తును అందించాలి

ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..

మాజీమంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..

**మహేశ్వరం, అక్టోబర్ 15, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** రైతులకు 24 గంటల విద్యుత్తును అందించాలని ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గురువారం పోరండ్ల, కోళ్ల పడకల్ గ్రామాలలో ఎండిపోయిన వరి పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎల్ నీలో ప్రభావం ఉంటుందని ముందే కేంద్రం హెచ్చరించిన రాష్ట్ర ప్రభుత్వానికి సోయి లేదని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదని ఆమె ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం కరోనా సమయంలో కూడా రైతులకు విద్యుత్ ను అందించడం జరిగిందని ఆమె గుర్తు చేశారు. రైతులకు 7 గంటల విద్యుత్ కాకుండా 24 గంటల విద్యుత్ ను అందించాలని ఆమె డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు న్యాయం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యాలకు నిదర్శనం అని ఆమె ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో 250 సార్లు ఢిల్లీకి వెళ్లడం జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ సీజన్ లో కనీసం రైతులకు 20, 30 రోజులు కరెంటు ఇవ్వాలని ఆమె అధికారులను ఆదేశించారు.



రైతులకు ఉచిత సలహాలు కాకుండా రైతులకు న్యాయం చేయాలని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడడంతో రైతులకు సాగునీరు అందడం లేదని ఆమె ఆందోళన వ్యక్తపరిచారు. రైతులకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం అని పంటలు ఎండిపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. రైతులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కరువు నేపథ్యంలో ప్రభుత్వం రైతులను ప్రత్యామ్నాయంగా ఆదుకోవాలని ఆమె అన్నారు. ఫ్యూచర్ సిటీలో ఉన్న రైతులకు 10 శాతం మందికి విద్యుత్తు ను ఇవ్వడం లేదని ఆమె ఆరోపించారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులతో ముఖాముఖి నిర్వహించారు.ఈ



కార్యక్రమంలో మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిలకమర్రి నరసింహ, సహకార బ్యాంకు వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు అనుమగల్ల చంద్రయ్య, కరోల్ల చంద్రయ్య ముదిరాజ్, పోరండ్ల సర్పంచ్ జయమ్మ కిష్టయ్య, మాజీ సర్పంచ్ ముత్యం సర్పంచులు మునగపాటి నవీన్, దేవులా నాయక్, జగదీష్ కుమార్, బండారి లింగం, దయ్యాల శీను, మోతిలాల్ నాయక్, స్లీవారెడ్డి, కుమార్ నాయకులు అరడి వెంకటేష్ యాదవ్, మంత్రి రాజేష్, జాన్ రెడ్డి, సీతారాం నాయక్, రఘు పతి అధికారులు విద్యుత్ ఏ డి ఈ శంకర్, ఏఈ రాంప్రసాద్ రెడ్డి రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ ఉద్యోగి మృతి, ఏడు నెలలుగా వేతనాలు అందగా మనోవేదన

చితికి నిప్పంటించిన కూతురు

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలం జలాల్పూర్ వద్ద గల మిషన్ భగీరథ నీటి సరఫరా పథకంలో పనిచేసే ఉద్యోగి కిసాన్ నగర్ గ్రామానికి చెందిన మల్లేష్(45) గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. గత ఏడు నెలలుగా వేతనాలు అందక.. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం, భార్యకు అస్వస్థత వల్ల ఆసుపత్రుల చుట్టూ తిరగడం, ఉన్న ఒక్క కుమారుడు గల్ఫ్ లో యుద్ధ వాతావరణంలో సరియైన జీతం లేకపోవడం మల్లేష్ పాలిట శాపంగా మారింది.తాను పనిచేసే మిషన్ భగీరథ సంస్థలో వేతనాల కోసం ఎదురుచూస్తూ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడని స్థానికులు తెలిపారు.గురువారం ఉదయం కూడా డ్యూటీకి పోవడానికి సిద్ధమవుతుండగా హఠాత్తుగా గుండెపోటుతో చనిపోయాడని చెప్పారు.గల్ఫ్ లో ఉన్న కుమారుడు మహర్షి స్వదేశానికి రాకపోవడంతో కూతురు చితికి నిప్పండించడం స్థానికులకు కలిచివేసింది.గత ఏడు నెలలుగా పని చేయించుకుంటూ వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్న మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని మల్లేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కలాం ఆశయాల సాధనే నిజమైన నివాళి

**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 15 :** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు గటిక అజయ్ కుమార్, టీపీసీసీ సభ్యుడు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ పీఏసీఎస్ చైర్మన్ చల్ల శ్రీపాల్ రెడ్డి, రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ అవుల శ్రీనివాస్, సూరిపల్లి పీఏసీఎస్ చైర్మన్ మాదాటి శ్రీనివాస్ లు వేరు వేరుగా జరిగిన కార్యక్రమాలలో ఘన నివాళులర్పించారు. విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని తన జీవితంతో నిరూపించిన కలాం యువతకు స్ఫూర్తిప్రదాతగా నిలిచారని వారు పేర్కొన్నారు. యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కలాం కలలుగన్న అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

# ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కి గౌడ్ ను సత్కరించిన మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మహేశ్వరం, అక్టోబర్ 15, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి, ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కి గౌడ్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొని మధుయాష్కి గౌడ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..**

మధుయాష్కి గౌడ్ నాయకత్వంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్స్‌ను పార్టీ వైపు ఆకర్షించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని నాయకులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి, డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు ధనరాజ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పందుల వెంకట్ గౌడ్, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ బొక్క భూపాల్ రెడ్డి, సరికొండ మల్లేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా,అక్టోబర్ 15, 2026 :** జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులు సిఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వేణుగోపాల్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సిఎంఆర్ డెలివరీ పై అధికారులు, రైస్ మిల్లుల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం డెలివరీలలో వెనుకబడిన మిల్లులు తమ పని తీరును మెరుగుపరుచుకొని, బియ్యం అప్పగింతలను వేగవంతం చేయాలని తెలిపారు. కొన్ని మిల్లులు నిర్దేశిత లక్ష్యాల సాధనలో జాప్యం చేస్తున్నాయని, పెండింగ్ లో ఉన్న సిఎంఆర్ బియ్యం డెలివరీలను తక్షణమే వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. సిఎంఆర్ బియ్యం లక్ష్యాల సాధనలో ఆలస్యం జరగకుండా మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమావేశంలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాక్రోచ్ జనతా పార్టీ నేతలను వెంటనే విడుదల చేయాలి

## రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) చీఫ్ కో-ఆర్డినేటర్ టి. పద్మారావు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్ కుమార్..



**మహేశ్వరం, అక్టోబర్ 15, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** కాక్రోచ్ జనతా పార్టీ నేతలను బేషరతుగా విడుదల చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) చీఫ్ కో-ఆర్డినేటర్ టి. పద్మ రావు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్ కుమార్ తెలిపారు. జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాను ప్రదర్శించినందుకు కాక్రోచ్ జనతా పార్టీ నేతలను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు తరలించడం దుర్మార్గమైన చర్యగా వారు అభివర్ణించారు. 13 కోట్ల ఓట్లను తొలగించి ఒక అరాచక విధానాన్ని ప్రవేశపెట్టిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించి రాజ్యాంగాన్ని కాపాడాలని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. జంతర్ మంతర్ ను ధర్నా ప్రదేశంగా తిరిగి అనుమతించాలని వారు డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు అభిజిత్ దీప్కే చేస్తున్న పోరాటానికి ఆర్ పీ ఐ( ఏ), షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం, అంబేద్కర్ సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి ప్రభు, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్, తెలంగాణ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. మధుసూదనరావు, కోశాధికారి విజయకృష్ణ పాల్గొన్నారు.

# చెరువులో పడి పోలీస్ కానిస్టేబుల్ మృతి



**పోరుతెలంగాణ ప్రతినిధి చెన్నూరు::** చెన్నూరు మండలం దుగునపల్లి గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది.. నీల్వాయి ప్రాంతంలో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న వీరబోయిన సమ్మయ్య ప్రమాదవశాత్తు దుగునపల్లి గ్రామ శివారులోని చెరువులో పడి మృతి చెందారు.. అయితే సమ్మయ్య మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.. సమ్మయ్య మృతికి గల అసలు కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది..

# లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో శ్రీ రాజరాజేశ్వర, రాజరాజేశ్వరి స్వామి అమ్మవార్లు





**మహేశ్వరం అక్టోబర్ 15, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరంలో ప్రసిద్ధిగాంచిన శివగంగా పుణ్యక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా ఘనంగా జరుగుతున్నాయి. దేవాలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఈవో మురళి కృష్ణ, ప్రధాన పూజారులు వీరేశం, రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం జరిగిన హోమంలో మోదిని ప్రభులింగం నాగవేణి, కడమోని బాలయ్య శాంత, మంచుకొండ రమేష్ శోభ రాణి పాల్గొన్నారు. మంచుకొండ రమేష్ శోభ రాణి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఓదెలలో 17వ విడత సామాజిక తనిఖీ సమావేశం






**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి. అనిల్ రెడ్డి అధ్యక్షతన 17వ విడత సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ డీఆర్డీఓ మల్లేశం, అంబుడ్స్‌పర్సన్, క్యూసీ, హెచ్‌ఆర్ ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటిస్తూ, నిబంధనల ప్రకారం పనులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించడంతో పాటు, పనులకు సంబంధించిన రికార్డులు, ఖర్చుల వివరాలను తనిఖీ చేయడం సామాజిక తనిఖీలో ప్రధాన అంశాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పనుల అమలులో ఏవైనా లోపాలు గుర్తిస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏ పీ ఓ, ఈసీ శ్వేత, జనార్ధన్ సంబంధిత అధికారులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఖాసిం

## హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఖాసిం



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ, అక్టోబర్ 15(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** పాల్వంచ: మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు, సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పుట్టినరోజు వేడుకలు హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఖాసిం పాల్గొని సాయి దుర్గా తేజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, సినీ రంగంలో మరిన్ని విజయాలు సాధించి ప్రేక్షకులను అలరించాలని ఖాసిం ఆకాంక్షించారు. మెగా కుటుంబంపై అభిమానాన్ని చాటుకుంటూ, తమ అభిమాన హీరో పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సాయి దుర్గా తేజ్ భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మెగా అభిమానులు ఆకాంక్షించారు.

# ఆనందపురంలో విద్యుత్ సమస్యల పరిష్కారం ప్రమాదాల నివారణకు చర్యలు!

## ఎస్సీ కాలనీలో వాలిన విద్యుత్ వైర్లను సరిచేసిన పంచాయతీ పాలకవర్గం

## తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

## ప్రజల భద్రతే లక్ష్యంగా రంగంలోకి దిగిన సర్పంచ్, అధికారులు



**భద్రాద్రి కొత్తగూడెం, (పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి)అశ్వాపురం అక్టోబర్ 15 :-** ఆనందపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ సమస్యలకు పంచాయతీ పాలకవర్గం సత్వర పరిష్కారం చూపింది. కాలనీలో ప్రధాన రహదారి వెంట ప్రమాదభరితంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సిబ్బంది సహాయంతో పైకి లాగి సరిచేయించారు. ?గ్రామంలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉంటూ ప్రమాదాలకు కారణమయ్యేలా ఉన్న చెట్ల కొమ్మలను కూలీలతో నరికించి తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముత్రం సమ్మయ్య మాట్లాడుతూ.. వర్షాకాలం, గాలుల సమయంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడటం వల్ల స్థానికులకు, మూగజీవాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించి ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాలనీ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని చెప్పారు. ?ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్రం సమ్మయ్య, ఉప సర్పంచ్ దేవానబోయిన మహేష్, పంచాయతీ కార్యదర్శి వేణు ప్రియ, వార్డు సభ్యులు సిద్ది రవికుమార్, కంగాల వీరస్వామి, ముత్రం సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. సకాలంలో స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినందుకు కాలనీవాసులు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మంఖల్ 67 డివిజన్ నూతన బీజేపీ అధ్యక్షుడిగా మెగావత్ రవీందర్ నాయక్ నియామకం

## మంఖల్ లో బీజేపీ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా..

## మెగావత్ రవీందర్ నాయక్..



**మహేశ్వరం, అక్టోబర్ 13, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిది,:** మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మంఖల్ 67వ డివిజన్ నూతన బీజేపీ అధ్యక్షుడిగా మెగావత్ రవీందర్ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మెగావత్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బడంగ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డికి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ కి, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు కి, సహకరించిన తుక్కుగూడ, మంఖల్ బిజెపి నాయకులు అందరికీ,జిల్లా నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, బీజేపీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, మంఖల్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువవుతూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# అత్యాధునిక న్యూరోసర్జరీ సేవల్లో యశోద హాస్పిటల్స్




**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:అక్టోబర్ 15.(పోరు తెలంగాణ న్యూస్:) :** సికింద్రాబాద్‌యశోద హాస్పిటల్ లో మెదడు, వెన్నెముక సంబంధిత సంక్లిష్ట వ్యాధులకు అత్యాధునిక సాంకేతికతతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు యశోద హాస్పిటల్స్‌లోని సెంటర్ ఫర్ న్యూరోఎండోస్కోపీ అండ్ రోబోటిక్ న్యూరోసర్జరీ ప్రత్యేకంగా పనిచేస్తోంది. డా. అయ్యదురై ఆర్, డా. కృష్ణ తేజ్ రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు అవసరాలకు అనుగుణంగా చికిత్స అందిస్తున్నారు. ఈ కేంద్రంలో మెదడు కణితులకు అధునాతన శస్త్రచికిత్సలు, మందులతో నియంత్రణలోకి రాని మూర్ఛకు శస్త్రచికిత్స, ట్రైజెమినల్ న్యూరల్జియా, మెదడులో రక్తస్రావం, వెన్నెముక సమస్యలకు కనిష్ట ఇన్వాసివ్ విధానాల్లో చికిత్స అందుబాటులో ఉంది. శస్త్రచికిత్స సమయంలో ఇంట్రాఆపరేటివ్ ఎంఆర్ఐ సాంకేతికతను ఉపయోగించి కణితి తొలగింపు స్థాయిని అంచనా వేయడంతోపాటు కీలకమైన మెదడు భాగాలను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ట్రైజెమినల్ న్యూరల్జియాకు సంబంధించి ఇప్పటివరకు 110 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు అక్టోబర్ 7న ప్రత్యేక క్లినిక్, అవగాహన బృందాన్ని ప్రారంభించింది. ఎండోస్కోపిక్, రోబోటిక్ సాంకేతికతలతో శస్త్రచికిత్స గాయాన్ని తగ్గించడం, త్వరగా కోలుకునేందుకు తోడ్పడటం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని వైద్యులు తెలిపారు. రోగి పరిస్థితిని బట్టి తగిన చికిత్సా విధానాన్ని ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలపేతం చేయలి



**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి అక్టోబర్ 15(పోరు తెలంగాణ న్యూస్:) :** మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలను ఆర్థికంగా బలవపేతం చేయడంతో పాటు, ఇప్పటికే కొనసాగిస్తున్న వ్యాపారాలను మరింత విస్తరించేందుకు వ్యక్తిగత రుణాలు కీలకమని డిపిఎం రాజయ్య అన్నారు. ఈ దిశగా అర్హులైన లబ్ధిదారులకు వ్యక్తిగత రుణాలు అందించేందుకు అవసరమైన దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. దోమకొండ మండల సమైక్య కార్యాలయంలో గురువారం వ్యక్తిగత రుణాల దరఖాస్తుల ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 29 గ్రామ సంఘాలకు చెందిన వి వో ఏ లు, సీసీలు, ఏపిఎం, అకౌంటెంట్, కెనెరా బ్యాంకు సిబ్బంది,మండల సమైక్య పాలకవర్గ సభ్యులు, మహిళ సంఘ సభ్యులు హాజరయ్యారు. వ్యక్తిగత రుణాల దరఖాస్తుల నమోదు, ఆన్లైన్ ప్రక్రియ బ్యాంకులకు దరఖాస్తులు అందజేయడం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు.

# దసరా నేపథ్యంలో నెక్కొండ అంగడి తేదీ మార్పు

**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 15 :** ప్రతి మంగళవారం నెక్కొండ మండల కేంద్రంలో నిర్వహించే వారపు అంగడిని దసరా పండుగ నేపథ్యంలో రెండు రోజుల ముందుగా నిర్వహించ నున్నారు. ఈ నెల 20న మంగళవారం దసరా పండుగ రావడంతో, గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్ణయం మేరకు ఈ నెల 18న ఆదివారం అంగడి నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు, రైతులు, కొనుగోలుదారులు తేదీ మార్పును గమనించి ఆదివారం జరిగే అంగడికి హాజరుకావాలని సూచించారు. పండుగ సందర్భంగా ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# బతుకమ్మ ఆట స్థలంలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం ప్రారంభం



**పోరు తెలంగాణ నెక్కొండ అక్టోబర్ 15 :** నెక్కొండ చెరువు సమీపంలోని బతుకమ్మ ఆట స్థలంలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేక చొరవతో ప్రత్యేక అభివృద్ధి నిధుల (ఎస్‌డీఎఫ్) నుంచి మంజూరైన నిధులతో చేపడుతున్న ఈ పనులను సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ ప్రారంభించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఆటపాటలు నిర్వహించే ఈ స్థలంలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణం పూర్తయితే వారికి మరింత సౌకర్యంగా ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నిధులు కేటాయించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మహిళ ఫిర్యాదు మేరకు వైద్యుడిపై కేసు నమోదు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన చుంచుపల్లి పోలీసులు



**కొత్తగూడెం అక్టోబర్ 15 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వైద్యం పేరుతో తనను వేధింపులకు గురిచేశాడని ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ నాడికూడి శైలేష్ కుమార్ (39)పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నిందితుడు కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని శ్రీ కృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. మహిళ ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 114/2026గా భారతీయ న్యాయ సంహిత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా అక్టోబర్ 15వ తేదీ తెల్లవారుజామున విద్యానగర్ కాలనీ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి అరెస్ట్ చేశారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు

# గుండాల మండల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**గుండాల అక్టోబర్ 15 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : గుండాల మండలంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఫ్గయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి ప్రజలకు అవసరమైన అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, చేపట్టిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, వినతులపై తక్షణమే స్పందించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దిశానిర్దేశం చేశారు. గుండాల మండల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి కానిస్టేబుల్ మృతి.



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, అక్టోబర్ 15** : చెన్నూరు మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన వీరబోయిన సమ్మయ్య తండ్రి పేరు ఐలయ్య వయసు 43 సంవత్సరాలు అను అతడు నీల్వాయి పోలీస్ స్టేషన్ నందు పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. సమ్మయ్య కు ప్రతిరోజు ఉదయం వాకింగ్ వెళ్లి బహిర్భూమికి వెళ్లడం అలవాటు. రోజులాగే ఈరోజు అనగా తేదీ 15- 10-2026 రోజున ఉదయం 5గంటలకు ఇంటి నుండి యధావిధిగా సమ్మయ్య వాకింగ్ మరియు బహిర్భూమికి ఇంటినుండి వెళ్లినాడు. 7 గంటలైనా సమ్మయ్య ఇంటికి రాక పోయే సరికి అతని గురించి అతని భార్య మరియు కుటుంబ సభ్యులు ఊర్లో వెతుకుతుండగా. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దుగ్నేపల్లి గ్రామ శివారు గల నక్కకుంట చెరువులో మృతుడు చనిపోయి ఉన్నాడు. మృతుడు బహిర్భూమికి చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవుశాత్తూ చెరువులో పడి ఈత రాక నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడు భార్య వీరబోయిన దీప్తి ఎ/శీ సమ్మయ్య, వ: 30 సంవత్సరాలు ఫిర్యాదు మేరకు SI శ్యామ్ పటేల్ గారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అశ్వాపురం పీహెచ్‌సీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 15** : అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వైద్య సిబ్బంది ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# గంగపల్లి గ్రామపంచాయతీలో అధికారుల పర్యటన.





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా అక్టోబర్ 15** : జైపూర్ మండలంలోని గంగిపల్లి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ కొరకు మండల అధికారులు ఎంపిడిఓ, తహసిల్దార్, డిప్యూటీ తహసీల్దార్ సందర్శించడం జరిగింది . అనంతరం, గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న దుర్గా దేవి అమ్మవారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. ఇట్టి పర్యటనలో సర్పంచ్ సుందిళ్ల రాజేశ్వరి మల్లేష్ , ఏసీపీ వెంకటేశ్వర్ , ఎంపీడీవో శ్రీపతి బాపు రావు , తహశీల్దార్ వనజా రెడ్డి, ఎస్సై భూమేష్ , డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి అరెల్లి సత్యనారాయణ గ్రామ ప్రజలు హాజరైనారు.

# ప్రతి సెకను ఎంతో విలువైనది

## కేవలం 5 రోజుల వయస్సున్న శిశువు మెదడును కాపాడిన అరుదైన శస్త్రచికిత్స!

**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:అక్టోబర్ 15(పోరు తెలంగాణ న్యూస్:)** : జీవితం కోసం పోరాటం కొన్నిసార్లు పుట్టిన కొద్ది రోజులకే ప్రారంభమవుతుంది. ప్రసవ సమయంలో తీవ్రమైన గాయానికి గురై, మెదడులో అధిక రక్తస్రావం (Intracranial Hemorrhage) అయిన కేవలం 5 రోజుల వయస్సున్న నవజాత శిశువును వరంగల్ నుంచి వెంటిలేటర్ సహాయంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. వైద్య బృందం వేగంగా పరిస్థితిని అంచనా వేసిన అనంతరం, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. ఆధునిక నావిగేషన్ సాంకేతికత మరియు న్యూరో-ఎండోస్కోపీ సహాయంతో మెదడులో పేరుకుపోయిన రక్తాన్ని తొలగించే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. నవజాత శిశువుకు మత్తుమందు ఇవ్వడం ఒక అత్యంత సవాలుతో కూడిన ప్రక్రియ! కేవలం 5 రోజుల వయస్సున్న శిశువుకు అనస్థీషియా అందించడం అనేది పెద్దవారికి అందించే అనస్థీషియాతో పోలిస్తే పూర్తిగా భిన్నమైనది. శిశువు యొక్క అతి చిన్న శ్వాసనాళాన్ని సురక్షితంగా నిర్వహించడం, రక్తనాళాల్లోకి మందులు అందించడం, శరీర ఉష్ణోగ్రతను మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం, స్వల్ప రక్తనష్టాన్ని కూడా జాగ్రత్తగా నిర్వహించడం, మెదడు పనితీరును స్థిరంగా ఉంచడం వంటి ప్రతి అంశంలోనూ అత్యంత అప్రమత్తత, ఖచ్చితమైన ప్రణాళిక అవసరం. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను డా. అయ్యదురై మరియు డా. కృష్ణ తేజ్ రెడ్డి నేతృత్వంలోని న్యూరోసర్జరీ బృందం విజయవంతంగా నిర్వహించింది.

**శస్త్రచికిత్స అనంతరం అద్భుతమైన పురోగతి!**

శస్త్రచికిత్స విజయవంతమైన తర్వాత శిశువును వెంటిలేటర్ నుంచి తొలగించారు. శిశువు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. ప్రస్తుతం సాధారణంగా పాలు తాగుతూ కోలుకుంటోంది.

**ఇది ఆ చిన్నారి జీవితంలో ఒక కొత్త ఆరంభం!**

ఈ అరుదైన వైద్య విజయం వెనుక నియోనటాలజీ, న్యూరోఅనస్థీషియా, న్యూరోసర్జరీ, (చీ×జఖ,ూ×జఖ )మరియు ఆపరేషన్ థియేటర్ బృందాల సమన్వయం, నిబద్ధత, నైపుణ్యం ఉన్నాయి. అత్యంత చిన్న వయస్సులో ఉన్న, అత్యంత సున్నితమైన ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా అన్ని విభాగాలు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చో ఈ కేసు నిరూపిస్తోంది. యశోద ఆసుపత్రి, సికింద్రాబాద్ చిన్నారి ప్రాణానికి కొత్త ఆశ, కొత్త జీవితం!

# ప్రకృతిని ప్రేమిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మచారి

## అరిటాకులో అన్నం అందరికీ ఆరోగ్యం





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : పర్యావరణ పరిరక్షణకు బాటలు వేస్తున్నఓదెల దుర్గాభవాని మండపాల నిర్వాహకులు అభినందనలు-సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ మెరుగు భీష్మచారి ప్రకృతి హితమైన అరిటాకుల వినియోగం ప్లాస్టిక్‌కు దూరంగా స్టీల్ గ్లాసులతో పర్యావరణ హితం! దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గాభవాని మండపాల వద్ద భక్తులకు ప్రసాదాలు, అన్నప్రసాదాలు అందించేందుకు ప్రకృతి హితమైన అరిటాకులను వినియోగిస్తూ, తాగునీటి కోసం ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులను ఉపయోగిస్తున్న మండపాల నిర్వాహకులకు హృదయపూర్వక అభినందనలు. నేటి కాలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్న నేపథ్యంలో, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఇలాంటి మంచి నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయం. మన సంప్రదాయాలకు అనుగుణంగా అరిటాకులను వినియోగించడం, పునర్వినియోగానికి అనువైన స్టీల్ గ్లాసులను ఉపయోగించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తున్నారు. భక్తితో పాటు ప్రకృతిపై బాధ్యత కూడా మనందరిదే! అనే స్ఫూర్తితో ముందుకు సాగుతున్న మండపాల నిర్వాహకులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడటం. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి హితమైన పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా మన భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలం. ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్న ఓదెలదుర్గాభవాని మండపాల నిర్వాహకులకు మరోసారి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ఈ స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతున్నాము. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను వీడి, ప్రకృతిని ప్రేమిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.

# చింతలమానేపల్లిలో గంజాయి పట్టివేత

## ముగ్గురు వ్యక్తుల అరెస్ట్.. 110 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం సీజ్....

## గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపుతాం ఎస్ఐ కమలాకర్....

**పోరు తెలంగాణ అక్టోబర్ 15: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : మహారాష్ట్ర నుంచి తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం ప్రాంతానికి గంజాయి సరఫరా అవుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 110 గ్రాముల గంజాయితో పాటు గంజాయి రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూడెం నుంచి వచ్చే మార్గంలో పోలీసులు మాటు వేసి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని తనిఖీ చేయగా వాళ్ల వద్ద గంజాయి లభించినట్లు ఎస్ఐ కమలాకర్ తెలిపారు.



అరెస్టయిన వ్యక్తుల వివరాలు

1. పాగిడి ప్రసాద్ -- గంగాపూర్
2. గాజిరెడ్డి సంతోష్ -- సిర్పూర్
3. గొల్ల సంతోష్ -- సిర్పూర్ టి

వీరంతా మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురు వ్యక్తులతో పాటు గంజాయి విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్రకు చెందిన గంజాయి విక్రయించిన వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ వెల్లడించారు.

**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ కమలాకర్ సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. గంజాయి సరఫరా లేదా విక్రయాలకు సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కమలాకర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రతి సెకను ఎంతో విలువైనది

## కేవలం 5 రోజుల వయస్సున్న శిశువు మెదడును కాపాడిన అరుదైన శస్త్రచికిత్స!

**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:అక్టోబర్ 15(పోరు తెలంగాణ న్యూస్:)** : జీవితం కోసం పోరాటం కొన్నిసార్లు పుట్టిన కొద్ది రోజులకే ప్రారంభమవుతుంది. ప్రసవ సమయంలో తీవ్రమైన గాయానికి గురై, మెదడులో అధిక రక్తస్రావం (×త్తీఘుఎత్తీఘుఅఖుశ్రీ ఎవశీతీత్తీఘుస్రవ) అయిన కేవలం 5 రోజుల వయస్సున్న నవజాత శిశువును వరంగల్ నుంచి వెంటిలేటర్ సహాయంతో సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. వైద్య బృందం వేగంగా పరిస్థితిని అంచనా వేసిన అనంతరం, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. ఆధునిక నావిగేషన్ సాంకేతికత మరియు న్యూరో-ఎండోస్కోపీ సహాయంతో మెదడులో పేరుకుపోయిన రక్తాన్ని తొలగించే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. నవజాత శిశువుకు మత్తుమందు ఇవ్వడం ఒక అత్యంత సవాలుతో కూడిన ప్రక్రియ! కేవలం 5 రోజుల వయస్సున్న శిశువుకు అనస్థీషియా అందించడం అనేది పెద్దవారికి అందించే అనస్థీషియాతో పోలిస్తే పూర్తిగా భిన్నమైనది. శిశువు యొక్క అతి చిన్న శ్వాసనాళాన్ని సురక్షితంగా నిర్వహించడం, రక్తనాళాల్లోకి మందులు అందించడం, శరీర ఉష్ణోగ్రతను మరియు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం, స్వల్ప రక్తనష్టాన్ని కూడా జాగ్రత్తగా నిర్వహించడం, మెదడు పనితీరును స్థిరంగా ఉంచడం వంటి ప్రతి అంశంలోనూ అత్యంత అప్రమత్తత, ఖచ్చితమైన ప్రణాళిక అవసరం. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను డా. అయ్యదురై మరియు డా. కృష్ణ తేజ్ రెడ్డి నేతృత్వంలోని న్యూరోసర్జరీ బృందం విజయవంతంగా నిర్వహించింది.

**శస్త్రచికిత్స అనంతరం అద్భుతమైన పురోగతి!**

శస్త్రచికిత్స విజయవంతమైన తర్వాత శిశువును వెంటిలేటర్ నుంచి తొలగించారు. శిశువు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. ప్రస్తుతం సాధారణంగా పాలు తాగుతూ కోలుకుంటోంది.

**ఇది ఆ చిన్నారి జీవితంలో ఒక కొత్త ఆరంభం!**




ఈ అరుదైన వైద్య విజయం వెనుక నియోనటాలజీ, న్యూరో-అనస్థీషియా, న్యూరోసర్జరీ, మరియు ఆపరేషన్ థియేటర్ బృందాల సమన్వయం, నిబద్ధత, నైపుణ్యం ఉన్నాయి. అత్యంత చిన్న వయస్సులో ఉన్న, అత్యంత సున్నితమైన ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా అన్ని విభాగాలు కలిసి పనిచేస్తే ఎలాంటి అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చో ఈ కేసు నిరూపిస్తోంది. యశోద ఆసుపత్రి, సికింద్రాబాద్ చిన్నారి ప్రాణానికి కొత్త ఆశ, కొత్త జీవితం!

# పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి





## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా,అక్టోబర్ 15, 2026** : మండల తహసిల్దార్ కార్యాలయాలలోని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తహసిల్దార్, సిబ్బందితో పలు రెవెన్యూ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్.- 2026 లో భాగంగా దావాలు, అభ్యంతరాల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. కార్యాలయానికి సంబంధించిన పెండింగ్ సర్టిఫికెట్లు, భూ భారతి ద్వారా అందిన దరఖాస్తులు , జి.ఓ.ఎం.ఎస్.నం.59, భూదాన్ భూములకు సంబంధించిన అంశాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత కాల పరిమితిలోగా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ధృవీకరణ పత్రాల కోసం నిరీక్షించకుండా పెండింగ్ సర్టిఫికెట్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, సూపరింటెండెంట్లు, సంబంధిత సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫైళ్ల పురోగతిపై విభాగాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఫైలును గడువులోగా పరిష్కరించాలని, కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని తెలిపారు. కార్యాలయ ఫైల్స్, రికార్డులను పక్కాగా నిర్వహించాలని, రికార్డుల భద్రత, నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రతి విభాగం సమర్థవంతంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అనధికార నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య






**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా,అక్టోబర్ 15, 2026 :** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అనధికార నిర్మాణాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని 17, 18 వార్డులను ఆకస్మికంగా సందర్శించి, ఆయా వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని 18వ వార్డులో సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో సి.సి. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, నిర్మాణంలో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు, సాంకేతిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. 17వ వార్డులో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని పరిశీలించి, మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపట్టడం విరుద్ధమని, సదరు నిర్మాణానికి సంబంధించి పూర్తి వివరాలను పరిశీలించి, తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియను అనుసరించి అనధికార నిర్మాణాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనధికార నిర్మాణానికి ఇంటి నంబరు కేటాయించి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్ వ్యవస్థలో నమోదు చేయడంలో సంబంధిత దరఖాస్తులు, అనుమతులు, ఇతర మున్సిపల్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపు జరిగినట్లు నిర్ధారణ అయితే అట్టి ఇంటి నంబరు వివరాలను నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ వ్యవస్థ నుంచి తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో అనధికార నిర్మాణాలకు ఇంటి నంబర్లు కేటాయించడం, వాటికి సంబంధించిన వివరాలను మున్సిపల్ రికార్డులలో నమోదు చేయడం వంటి అంశాలలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళిక అమలుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు క్రమబద్ధమైన పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు నాణ్యమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 86, 87, 88, 89 పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న ప్రత్యేక శిబిరాలను సందర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా దావా, అభ్యంతరాల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. బెల్లంపల్లి ఈఆర్ఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఓటరు జాబితా సమగ్ర సవరణలో అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో ఉండాలని, అనర్హుల వివరాలు ఉండకూడదని, ఆ దిశగా స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్, అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనులకు సింగరేణి సీఎస్ఆర్ నిధులు రూ.2.44 కోట్లు అందజేత

జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం అక్టోబర్ 15 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక నియోజకవర్గ పరిధిలో గ్రామీణాభివృద్ధితో పాటు వైద్య, విద్యా రంగాల అభివృద్ధి, జల సంరక్షణకు సంబంధించిన పనుల నిర్వహణ కోసం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్-సీసీఎల్) సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను కేటాయించింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టనున్న అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.4,93,80,000 కేటాయించగా, అందులో 50 శాతం అడ్వాన్స్‌గా రూ.2,44,30,000 విలువైన చెక్కును బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు సింగరేణి మణుగూరు ఏరియా అధికారులు కలెక్టర్ ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి సింగరేణి సంస్థ అందిస్తున్న సీఎస్ఆర్ నిధులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వైద్య, విద్యా రంగాల అభివృద్ధి, జల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి సింగరేణి సంస్థ సహకారం అందించడం అభినందనీయమని తెలిపారు. కేటాయించిన నిధులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సద్వినియోగం చేస్తూ, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. అనంతరం సింగరేణి అధికారులు అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామీణాభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, సివిల్ విభాగానికి చెందిన జి. శివప్రసాద్, సి పి ఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు





**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా,అక్టోబర్ 15, 2026 :** భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం చేపట్టిన భూ భారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో భూ భారతి పోర్టల్‌లోని పాస్‌బుక్ డేటా సవరణ సేవపై తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోర్టల్‌లో పాస్‌బుక్ డేటా సవరణకు సంబంధించిన విధివిధానాలు, దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. భూ భారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, జీ.ఓ. నంబర్ 59, 76 లకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి అవసరమైన క్షేత్రస్థాయి విచారణలు, పరిశీలనలు పూర్తి చేసి, సంబంధిత రికార్డులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులు, దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హమైన దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి సూపరింటెండెంట్, డి సూపరింటెండెంట్, ఎఫ్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతులతో తక్కువ పెట్టుబడికి అధిక దిగుబడులు సాధించాలి

ఆసిఫాబాద్‌లో కిసాన్ మేళా ప్రారంభం....

వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు చేయాలని సూచన....



**పోరు తెలంగాణ అక్టోబర్ 15: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రేమల గార్డెన్స్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాను ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబు, అధికారులతో కలిసి ప్రారంభించారు. మేళాలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాల స్టాళ్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధునిక సాగు పద్ధతులు, నూతన వంగడాలు, యాంత్రీకరణ, ప్రభుత్వ రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించడమే కిసాన్ మేళాల ఉద్దేశమని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున, నీటి లభ్యత, వర్షపాతం, నేల స్వభావాన్ని బట్టి ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడితే కొరత పరిస్థితులను అధిగమించవచ్చన్నారు. జిల్లాలో సాగు విధానాల్లో మార్పుల కోసం చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా వరి సాగు విస్తీర్ణాన్ని 25 శాతం వరకు తగ్గించగలిగామని తెలిపారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ వంటి శాస్త్రీయ పద్ధతులను విత్తనం వేసినప్పటి నుంచి పంట కోత వరకు పాటించాలని కోరారు.సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ, మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా యాసంగిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పంటల ఎంపిక, విత్తనాలు, ఎరువులు, సస్యరక్షణ విషయాల్లో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. యాంత్రీకరణ వల్ల సమయం, శ్రమ ఆదా అవుతాయని చెప్పారు.ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో చెరువులు, ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు తగ్గాయని, రానున్న రెండు, మూడు నెలల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల అందుబాటులో ఉన్న నీటిని బట్టి పంటలు ఎంచుకుని, అధికారుల సూచనలతో సాగులో మార్పులు చేసుకోవాలని కోరారు. రైతులకు తగిన సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

# ఆదివాసీల హక్కులను కాలరాస్తే సహించం

సిర్పూర్(యు) ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని ముట్టడించిన తుడుందెబ్బ.....



**పోరు తెలంగాణ అక్టోబర్ 15: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** సిర్పూర్(యు) మండలం ఏజెన్సీ గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అటవీ అధికారులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో గురువారం సిర్పూర్(యు) ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని ముట్టడించి భారీ ధర్నా నిర్వహించారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కొమురం భీం, అంబేద్కర్ విగ్రహాల వద్ద నుంచి డోలు వాయిద్యాలు, నినాదాలతో రేంజ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యాలయం ఎదుట బైఠాయించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొని, ట్రాఫిక్ స్తంభించింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల ఆచారాలు, సంస్కృతి, జీవన హక్కులకు రక్షణ ఉందని, 1/70 చట్టం, పేసా చట్టం-1996 నిబంధనలను అటవీ అధికారులు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్)-2006 సెక్షన్ 3(2) ప్రకారం రహదారులు, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, పాఠశాలలు తదితర 13 రకాల మౌలిక వసతులకు గ్రామసభ ఆమోదంతో అటవీ భూమిని వినియోగించుకునే హక్కు ఉందని, అనుమతుల పేరుతో పనులు ఆపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.సెక్షన్ 4(5) ప్రకారం హక్కుల ధ్రువీకరణ పూర్తయ్యే వరకు ఏ ఆదివాసీని భూమి నుంచి తొలగించరాదని, పంటలు ధ్వంసం చేసినా, భూములు లాక్కున్నా అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టిస్తామని హెచ్చరించారు. తునికాకు, ఇప్పపువ్వు, తేనె, వెదురు వంటి చిన్న అటవీ ఉత్పత్తుల తరలింపునకు ట్రాన్సిట్ పాస్ అవసరం లేదని, అక్రమంగా సరుకు సీజ్ చేసి కేసులు పెడితే సహించబోమని అన్నారు.అటవీ శాఖ తన వైఖరి మార్చుకుని, ఆగిన సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల పనులకు ఆటంకం కలిగించకూడదని, లేకుంటే ఏజెన్సీ వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం రేంజ్ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

# జిల్లా పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా

రికార్డుల నిర్వహణ కచ్చితంగా ఉండాలని సూచన....



**పోరు తెలంగాణ అక్టోబర్ 15: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వార్షిక తనిఖీల్లో భాగంగా కాళేశ్వరం మల్టీజోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా (ఐపీఎస్) గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్పీ నితికా పంత్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యాలయ ఆవరణను పరిశీలించిన డీఐజీ, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని సూచించారు. డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్బీ)ని తనిఖీ చేసి, నేరాల రికార్డులు, కేసుల వివరాలు, నేరస్థుల డేటా, పెండింగ్ కేసుల రిజిస్టర్లు, ఫైళ్ల నిర్వహణను పరిశీలించారు. అలాగే ఏ, బీ సెక్షన్లు, ఫింగర్‌ప్రింట్, డీ4సీ, కమాండ్ కంట్రోల్ విభాగాల్లో రికార్డులు, సిబ్బంది విధుల తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, పోలీస్ శాఖ సమర్థవంతమైన పనితీరుకు కచ్చితమైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని అన్నారు. కేసులు, నేరాల సమాచారాన్ని పొరపాట్లు లేకుండా నమోదు చేసి, అవసరమైనప్పుడు వెంటనే అందుబాటులో ఉండేలా డేటాను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, పెండింగ్ రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, ఫైళ్ల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు.అనంతరం ఉచిత పోలీస్ నియామక శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 160 మంది అభ్యర్థులతో డీఐజీ మాట్లాడి, వారి సన్నద్ధత వివరాలు తెలుసుకున్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు.

# బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

కొమురం భీం ప్రాజెక్టు ఒడ్డున ఘనంగా వేడుకలు....



**పోరు తెలంగాణ అక్టోబర్ 15: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆసిఫాబాద్ జిల్లాలో ప్రకృతిలో లభించే రంగురంగుల పూలను పేర్చి దేవతగా పూజించే బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కొమరం భీం ప్రాజెక్టు ఒడ్డున జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఎస్పీ నితికా పంత్, జిల్లా అటవీ శాఖ అధికారి, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుతో కలిసి గౌరమ్మను పూజించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యాటక ప్రదేశమైన కొమరం భీం ప్రాజెక్టు ఒడ్డున వేడుకలు నిర్వహించడం ద్వారా ఈ ప్రాంత విశిష్టతను ప్రజలకు తెలియజేయవచ్చని అన్నారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటుతుందని, మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం సంతోషకరమని అన్నారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

# ఎయిడ్స్ నివారణలో అందరూ భాగస్వాములు కావాలి

హెచ్ఐవీ అవగాహన బైక్ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 15: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ ఆవరణలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్ఐవీ అవగాహన బైక్ ర్యాలీని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 736 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నారని, వారందరికీ రింగ్స్ ఆసుపత్రి ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లా సురక్షిత స్థితిలోనే ఉందని, ఎయిడ్స్‌పై అపోహలు, భయాలు అవసరం లేదని అన్నారు. హెచ్ఐవీ లక్షణాలున్నవారు క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసుకుని వివరాలు తెలుసుకోవచ్చని, ఎయిడ్స్ హెల్ప్‌లైన్ 1097కు ఫోన్ చేసి మరింత సమాచారం పొందవచ్చని చెప్పారు. లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేస్తే జీవిత భాగస్వామికి సోకే ప్రమాదం ఉందని, అశ్రద్ధ చేయవద్దని సూచించారు.

# ఈసం లక్ష్మీకి రూ.10 లక్షల ఎల్ఓసీ అందజేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**గుండాల అక్టోబర్ 15 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** గుండాల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, కరకగూడెం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన ఈసం లక్ష్మీకి వైద్య చికిత్స నిమిత్తం రూ.10 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొంటూ, అర్హులైన వారు ప్రభుత్వ సహాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు.

# జైపూర్ గ్రామపంచాయతీలో ఎంపీడీవో పర్యటన.




**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా అక్టోబర్ 15 :** జైపూర్ ఎంపీడీఓ శ్రీపతి బాపురావు సమక్షంలో జైపూర్ గ్రామపంచాయతీ పోలీస్ స్టేషన్ లో రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జైపూర్ లో రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను ఈసీ , ఏపీవో , ఎఫ్ ఏ గుర్తించారు . ఇట్టి పనులకు వెంటనే ఎస్టిమేట్స్ ప్రిపేర్ చేయాలని విబ్జి రాంజీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మల్లయ్య ,పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.